# 'రీసర్చ్'లో రిజర్వేషన్లు తీసేయడం ఏం న్యాయం?

దేశంలోని విశ్వవిద్యాలయాలు ఎం.ఫిల్, పిహెచ్.డి కోర్సుల అడ్మిషన్లలో ఎస్.సి, ఎస్.టి రిజర్వేషన్లు పాటించనక్కరలేదని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యు.జి.సి.) ఈ మధ్యనే ఒక సర్క్యులర్ జారీ చేసింది. యు.జి.సి చేసే విధానపరమైన నిర్ణయాలు అన్ని విశ్వవిద్యాలయాలకూ శిరోధార్యం కాబట్టి ఇది చాలా ప్రాముఖ్యం గల నిర్ణయం. వేలాది దళిత ఆదివాసీ యువకుల భవితవ్యం మీద దుష్ప్రభావం వేసే నిర్ణయం.

సామాజిక న్యాయాన్యాయాల సంగతి కొంచెం సేపు పక్కనపెట్టి, ఇటువంటి నిర్ణయం తీసుకునే అధికారం యు.జి.సికి ఉందా అన్న ప్రశ్న వేసుకోవాలి. యు.జి.సికి ఉండే అధికారాలను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చట్టం చెప్తుంది. ఆ సంస్థకు విద్యా ప్రమాణాలను, అధ్యాపకుల నియామకానికి సంబంధించిన ప్రమాణాలను నిర్ధారించే అధికారం చాలానే ఉంది. అయితే విద్యా రంగానికి సంబంధించిన విషయా లలో ప్రభుత్వం నిర్ణ యించిన 'జాతీయ విధానాల'కు లోబడి యు.జి.సి వ్యవహరించాలని ఆ చట్టంలోని సెక్షన్ 20 అంటుంది.

ఎస్సి, ఎస్టి రిజర్వేషన్లు యాభై సంవత్సరాలుగా ప్రభుత్వ జాతీయ విధానంలో భాగంగా ఉన్నాయి. ఆ విషయంలో మార్పేమీ లేక పోగా, ఈ మధ్యకాలంలో స్త్రీలకు, బిసిలకు కూడా రిజర్వేషన్లు కల్పించడం ఒక జాతీయ విధానం అయింది. మండల్ కమిషన్ సూచనల ఫలితంగా బిసిలకు కల్పించిన రిజర్వేషన్లు ఉన్నత విద్యా సంస్థలకు కూడా వర్తిస్తాయా అన్న సందేహం వ్యక్తం కాగా, 1994లో కేంద్ర ప్రభుత్వం వర్తిస్తాయనే చెప్తూ సర్క్యులర్ జారీ చేసింది.

రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న విధానం రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో ప్రకటించింది. ఒక్క ప్రమోషన్లలో రిజర్వేషన్‌ను మాత్రమే రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు కొట్టేయగా, అన్ని పార్టీలు ఏకగ్రీవంగా అంగీకారాని కొచ్చి రాజ్యాంగాన్ని సవరించి ప్రమోషన్లలో రిజర్వేషన్లను కూడా రాజ్యాంగబద్ధం చేసాయి.

ఇంత సంపూర్ణంగా ఒక జాతీయ విధానంగా ఉన్న రిజర్వేషన్లను కాదంటూ సర్క్యులర్ జారీచేసే అధికారం యు.జి.సికి ఎక్కడిది? పైగా, ఇదొక ప్రముఖమైన సామాజిక విషయమన్న స్పృహ కూడా లేకుండా ఏదో అతి చిన్న విషయమయినట్టు నాలుగు లైన్ల సర్క్యులర్‌ను యథాలాపంగా పంపించడంలోని అహంకారాన్ని ఏమనాలి?

సమానులను చట్టం అసమానంగా చూడడం రాజ్యాంగ విరుద్ధమని రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 అంటుంది. అసమానులను చట్టం సమానులుగా చూడడం కూడా అదే అధికరణం కింద రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ రాజ్యాంగ ప్రమాణాలు తమకు వర్తించవని యు.జి.సి అధినేతలు భావిస్తున్నారా?

చట్టం సంగతి అటుంచి విధానపరంగా ఆలోచిస్తే, 50 ఏళ్లుగా జాతీయ విధానాలుగా గుర్తింపు పొందిన వాటి పట్ల ఈ రోజు అధికార స్థానాలలో ఉన్నవాళ్లలో పెరిగిన వ్యతిరేక భావనే నిజానికి ఈ నిర్ణయం వెనుక ఉందనడంలో సందేహం లేదు. ఆ అధికారం వారికి చట్టంలో లేకపోతే వారు చట్టాన్నే ఖాతరు చేయరు. కోర్టులలో తీర్పులిచ్చేది ఎప్పటికప్పుడు న్యాయమూర్తుల స్థానంలో కూర్చున్న వారే కాబట్టి, ఈ వ్యతిరేక భావన గలవాళ్లు ఆ స్థానాలలో కూర్చునేకొద్దీ అదే న్యాయస్థానం అభిప్రాయం అవుతుంది. రాజకీయ నాయకులకు ఓట్లు కావాలి కాబట్టి ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోక తప్పదు. అందువల్ల రాజకీయ పార్టీలు చేసే విధాన నిర్ణయాలలో ఇటువంటి మార్పులు రావడానికి కొంత సమయం పడుతుంది. అయినప్పటికీ అది అసంభవమనుకుంటే పొరబాటే.

రాజ్యాంగం రాసుకున్నప్పుడు సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయాన్ని దేశ లక్ష్యంగా ప్రకటించుకున్నాం. ఇప్పుడు ఆ లక్ష్యమే ఒక పనికిమాలిన సెంటిమెంట్‌గా చాలామందికి కనిపిస్తున్నది. దాని స్థానంలో వేగవంతమైన ఆర్థిక అభివృద్ధిని దేశ లక్ష్యంగా నిలబెట్టాలన్నది ప్రస్తుత ప్రయత్నం. సామాజిక న్యాయం కావాలంటే ఇప్పటిదాకా అవకాశాలు నిరాకరించబడినవారికి అవకాశాలు అందియ్యాలి. వేగవంతమయిన ఆర్థిక పెరుగుదల లక్ష్యమయితే ఇప్పటికే అవకాశాలు ఉన్నవారికే మరిన్ని అవకాశాలు ఇవ్వాలి. వారే వాటిని 'సమర్థంగా' వాడుకోగలుగుతారు. అర్థశాస్త్ర పరిభాషలో చెప్పాలంటే 'వాల్యు-అడిషన్' అప్పుడే ఎక్కువ ఉంటుంది.

ఈ రకమైన ఆలోచనల ఫలితమే యు.జి.సి. సర్క్యులర్. ప్రజాకాంక్షల నుండి పుట్టిన విధానాలను కార్యాలయాలలో కూర్చున్న కొద్దిమంది 'నిపుణులు' ఇష్టమొచ్చినట్టు మార్చడానికి వీలులేదు. రాజ్యాంగం నుండి సంక్రమించిన బాధ్యతల వెలుగులో ఉన్నత విద్యా ప్రమాణాలు, విద్యావ్యవస్థ ప్రమాణాలు నిర్ణయించమని యు.జి.సి అధికారులకు ఉద్యోగాలిచ్చారే గానీ తమ బుద్ధికి తోచిన విధానాలు రూపొందించమని కాదు. ఇప్పటికే సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోర్సులను ప్రోత్సహించే పేరుమీద ఉన్నత విద్యలో ఒక భాగాన్ని పేదలకు దూరం చేశారు. రీసర్చ్‌లో రిజర్వేషన్లు తీసేసి దళితులకూ, ఆదివాసులకూ పరిశోధనావకాశాలు కూడా దూరం చేస్తున్నారు. ఒక దళిత మేధావి వర్గం ఎదగకుండ అడ్డుపడడానికి ఇది పెత్తందారీ కులాలకు చెందిన అధికారులు చేస్తున్న కుట్ర అని దళిత ఉద్యమకారులు ఆరోపిస్తున్నారంటే ఆశ్చర్యమేముంది?

*నీహార్ ఆన్‌లైన్.కామ్*
*2002*